రెండు నెలలకో కేసు!

కేటీఆర్‌పై వరుస కుట్రలు • ఆరు గ్యారెంటీలపై నిలదీస్తే ఆరుసార్లు కేసులకు యత్నం! • రేసు కేసు కన్నా ముందే ఇరికించే పన్నాగం

వ్యక్తిగతంగానూ టార్గెట్ చేసి మంత్రుల దూషణలు • భగ్గుమంటున్న బీఆర్ఎస్ నేతలు, అభిమానులు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతున్నదని రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఫార్ములా ఈ-రేస్ కేసుకన్నా ముందే అవకాశం దొరికితే ఆయనను అరెస్టు చేయాలనే ప్రయత్నాలు అనేకం జరిగాయి. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కేటీఆర్ సారథ్యంలో కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఒత్తిడి చేస్తున్నది. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపిన ప్రతిసారీ, ప్రజల్లో సర్కార్‌పై అసమ్మతి పెరిగిన సందర్భాల్లో కేటీఆర్‌ను టార్గెట్‌గా చేసుకొని ఏదో ఒక అంశాన్ని తెరమీదికి తెస్తున్నారని, వ్యక్తిగతంగానూ లక్ష్యంగా చేసుకొని మంత్రులు విమర్శలు చేస్తున్నారని, సంబంధం లేని అంశాల్లో కేటీఆర్ ప్రమేయం ఉన్నదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, సోషల్ మీడియాలోనూ తీవ్ర స్థాయిలో తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేస్తున్నారని ఇటీవలి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆరు గ్యారెంటీలపై అడిగితే అరడజనుసార్లు కేటీఆర్‌ను కేసుల్లో ఇరికించాలని సర్కార్ కత్తిగట్టిందని బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. ఎక్కడా ఏమీ దొరక్కపోయేసరికి బ్యాంకు టు బ్యాంకు అదీ ప్రభుత్వంగా చేసిన లావాదేవీలను బూచిగా చూపి అవినీతికి ఆస్కారంలేని కేసని తెలిసినా కేటీఆర్‌ను ఉద్దేశపూర్వకంగా ఇరికించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడినప్పటి నుంచి కేటీఆర్ టార్గెట్‌గా జరిగిన పరిణామాలను చూస్తుంటే ప్రభుత్వానికి ప్రత్యేకించి సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్‌పై కక్షసాధింపు పంతం ఏ స్థాయిలో ఉన్నదో స్పష్టమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు ఉదహరిస్తున్నారు.

లగచర్ల ఉదంతంలో..

ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను అడ్డుకొని అధికారులపై కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులు దాడిచేసిన ఘటనలోనూ కేటీఆర్‌ను ఇరికించేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఏ విషయం వెల్లడించకున్నా ఆ ఉదంతంతో కేటీఆర్‌కు సంబంధం ఉన్నదని పోలీసులతో ప్రభుత్వం కట్టుకథ అల్లింది.

జన్వాడ ఫామ్‌హౌస్..

జన్వాడ ఫామ్‌హౌస్‌పై అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచీ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తూనే ఉన్నది. ఫామ్‌హౌస్ తనది కాదని కేటీఆర్ వివరణ ఇచ్చినా వినలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా దుష్ప్రచారం కొనసాగించింది. నిరుడు ఆగస్టులో ఇరిగేషన్ అధికారులు ఫామ్‌హౌస్ వద్ద కొలతలు వేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదంటూ హడావుడి చేశారు. 'కేటీఆర్‌కు చెందిన ఫాంహౌస్‌లో కూల్చివేతలు' అంటూ మీడియా సైతం హడావుడి చేసింది. అయితే, ఆ ఫామ్‌హౌస్ తనది కాదని, తన స్నేహితుడిదని, ఒకవేళ అది నిబంధనలకు విరుద్ధంగా ఉంటే దానిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చని కేటీఆర్ మీడియా సమావేశంలో ప్రకటించారు.

కుటుంబ దావత్‌కు రేవ్‌పార్టీ ముసుగు

జన్వాడలోని కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో నిరుడు అక్టోబర్‌లో ఓ శుభకార్యం జరిగింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు హాజరయ్యారు. అయితే కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వపెద్దల ప్రోద్బలంతో దాన్ని రేవ్ పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అర్ధరాత్రి పోలీసులు దాడులు చేశారు. డ్రగ్స్, విదేశీ మద్యం దొరికాయని హడావుడి చేశారు. చివరికి ఫ్యామిలీ ఫంక్షన్ అని తేలడంతో ప్రభుత్వం తెల్లముఖం వేసింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో..

ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు సంబంధం లేదని, అవసరమైతే నార్కో టెస్ట్‌కు రెడీ అని కేటీఆర్ వెల్లడించారు. తనపై నిత్యం ఆరోపణలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనతోపాటు లైడిటెక్టర్, నార్కో అనాలసిస్ పరీక్షకు రావాలని కేటీఆర్ సవాల్ విసిరిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనకు సంబంధం లేదని కేటీఆర్ పదే పదే స్పష్టం చేసినా సర్కారు శతవిధాలా ఆయనను ఇరికించాలని చూసింది. సీఎం రేవంత్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు తన ఫోన్‌ను, ఇతర ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని కేటీఆర్ బహిరంగంగానే ఆరోపించారు. ట్యాప్ చేయడం లేదని చెప్పే దమ్ము, ధైర్యం సీఎం రేవంత్‌రెడ్డికి లేదని తేల్చిచెప్పారు.

మంగళవారం నందినగర్‌లోని తన నివాసంలో పార్టీ శ్రేణులు, అభిమానులతో కరచాలనం చేస్తున్న కేటీఆర్

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ కేసులో

సంచలనం రేపిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అవినీతి వ్యవహారంలో కేటీఆర్‌ను ఇరికించాలని సర్కార్ కుట్ర చేసిందన్న ఆరోపణలున్నాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు న్యాయస్థానానికి సమర్పించిన కన్ఫెషన్ రిపోర్ట్‌లో ఏ చిన్న అవకాశం దొరికినా సరే కేటీఆర్ పేరు చేర్చాలని ప్రయత్నించింది. అయితే, అందులో ఎలాంటి ఆధారాలూ దొరక్కపోవడంతో మరో మార్గం కోసం వేచి చూసింది.

సోషల్ మీడియా వేదికగా

కాంగ్రెస్ తమ అనుకూల మీడియా, సోషల్ మీడియాలో కేటీఆర్‌పై తీవ్ర దుష్ప్రచారం చేస్తున్నదని బీఆర్ఎస్ మండిపడుతున్నది. పార్టీ కార్యక్రమం కోసమో, ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకో ఢిల్లీకి వెళ్లినా 'కేసుల నుంచి తప్పించుకునేందుకు బీజేపీ పెద్దలను కలుస్తున్నారు' అంటూ ప్రచారం చేశారని, రాజ్‌పాకాల ఇంట్లో ఫంక్షన్ విషయంలోనూ అర్ధరాత్రి దాటిన తర్వాత కేటీఆర్ అక్కడికి వెళ్లారని, ఆయన భార్య పార్టీలో పాల్గొన్నారని ప్రచారం చేశారని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తంచేశాయి.

లోకం పోకడ

వీడి సర్కార్ బడి చదువు ఏడిచినట్టే వుంది.. ABC రాయమని ఎన్నిసార్లు అడిగినా ఏం రాస్తున్నాడో చూడండి!

16న విచారణకు రండి

కేటీఆర్‌కు మరోసారి ఈడీ నోటీసులు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మంగళవారం మరోసారి నోటీసులిచ్చారు. ఈనెల 16న తమ ఎదుట విచారణకు హాజరుకావాలని కోరారు. హైకోర్టులో తాను వేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసి ఉన్నందున విచారణకు రాలేనని సోమవారం రాత్రి కేటీఆర్ సమాధానం ఇవ్వడంతో మరో తేదీ ప్రకటిస్తామని ఈడీ చెప్పింది. అయితే, కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఈనెల 16న విచారణకు రావాలని ఈడీ అధికారులు కేటీఆర్‌కు నోటీసులు పంపారు. కాగా, ఈనెల 9న విచారణకు రావాలని ఏసీబీ అధికారులు సోమవారం రాత్రి నోటీసులిచ్చారు.

సుప్రీం కోర్టుకు కేటీఆర్

ఏసీబీ కేసులో హైకోర్టు ఆర్డర్‌ను కొట్టేయాలని అప్పీల్ పిటిషన్

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేసుపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు వెలువరించిన తీర్పును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, కల్వకుంట్ల తారకరామారావు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఏసీబీ కేసును సవాలు చేస్తూ వేసిన క్వాష్ పిటిషన్‌ను మంగళవారం తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ మంగళవారం సాయంత్రం కేటీఆర్ న్యాయవాది మోహిత్‌రావు సుప్రీంకోర్టులో అప్పీల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేయడం రాజకీయ కక్షసాధింపేనని, ప్రాథమిక విచారణ లేకుండానే ఏసీబీ కేసు నమోదు చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ ఆర్థిక ప్రయోజనం పొందినట్టు ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసు వల్ల తెలంగాణ ప్రతిష్ఠ విశ్వవ్యాప్తంగా పెరిగిందని, ఆర్థికంగా కూడా రాష్ట్రానికి మేలు జరిగిందని తెలిపారు. ఫార్ములా ఈ వల్ల రాష్ట్రానికి రూ.110 కోట్ల లాభం వచ్చిందని వెల్లడించారు. ఫార్ములా-2 రేస్ నిమిత్తం ప్రభుత్వం, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ), ఏస్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరిందని, ఇందులో 10వ సీజన్ తరువాత ప్రమోటర్ వెళ్లిపోవడంతో ప్రభుత్వమే చెల్లింపులు జరిపి రేస్ నిర్వహణకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఇది విధాన నిర్ణయమని, ఇందులో తప్పుఒప్పులు ఉంటే వాటిని ప్రభుత్వమే సరిదిద్దుకోవాలని అన్నారు. నిధుల దుర్వినియోగం లేనప్పుడు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 3(1)(ఏ) కింద కేసు నమోదు చేయడానికి వీల్లేదని తెలిపారు. పీసీ యాక్ట్ సెక్షన్ 13(2)పెట్టడానికి నేరపూరిత ప్రవర్తన ఎక్కడా లేదని, ఐపీసీ 409 కింద ఏ ఒక్క ఆధారం ఏసీబీ దగ్గర లేదని తెలిపారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ చూస్తే ఈ విషయాలు తెలుస్తాయన్నారు. ఒప్పందంలో మధ్యవర్తిత్వ క్లాజ్ ఉందని, దీనిని కోర్టులో సవాలు చేయడానికి వీల్లేదని వివరించారు. ఎఫ్ఐఆర్‌పై తదుపరి ప్రొసీడింగ్స్‌ను నిలిపివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని బుధవారం సుప్రీంకోర్టును అభ్యర్థించే అవకాశముంది.

కేవియట్ దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం..

మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో మంగళవారమే కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఈ ఫార్ములా కేసులకు సంబంధించిన ఏదైనా తీర్పు ఇచ్చేముందు తమ వాదనలు కూడా వినాలని సుప్రీంకోర్టును ప్రభుత్వం కోరింది.

'గ్రీన్‌కో'లో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, మచిలీపట్నంలో తనిఖీలు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : ఫార్ములా ఈ-కార్ రేస్‌కు సంబంధించి హైకోర్టులో క్వాష్ పిటిషన్ డిస్మిస్ అయిన వెంటనే.. ఏపీ, తెలంగాణలో మోహరించిన ఏసీబీ అధికారులు మంగళవారం గ్రీన్ కో, అనుబంధ సంస్థల్లో సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో, ఏపీలో కృష్ణాజిల్లా మచిలీపట్నం గ్రీన్ కో ఎనర్జీ కార్యాలయంలో తనిఖీలు చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని గ్రీన్ కో ఎనర్జీ కార్యాలయంలో మంగళవారం ఉదయం నుంచి దాదాపు 12 మంది ఏసీబీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాత్రి వరకూ సోదాలు కొనసాగగా పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో గ్రీన్ కో సంస్థ కీలకంగా ఉన్న సంగతి తెలిసిందే. మరోవైపు హైదరాబాద్ మాదాపూర్‌లోని సైబర్ టవర్స్ 4వ అంతస్తులో అధికారులు సోదాలు చేపట్టారు. 'ఏస్ నెక్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్'లో తనిఖీలు చేసి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

లబ్ధి లేదు.. లంచం లేదు

మొదటిపేజీ తరువాయి...

అర్థం అవుతుంది. ప్రభుత్వం చేస్తున్నది దుష్ప్రచారమని తేలిపోతుంది.

బాండ్ల వెనుక అసలు చరిత్ర..

గ్రీన్ కో, దాని అనుబంధ సంస్థలు కలిసి బీఆర్ఎస్ బాండ్లను కొనుగోలు చేశాయని ప్రభుత్వం ఆరోపిస్తున్నది. వాస్తవానికి రాజకీయ పార్టీలకు గోప్యంగా విరాళాలు ఇచ్చేలా 'ఎలక్టోరల్ బాండ్ల' పద్ధతిని ఎన్డీయే ప్రభుత్వం 2018 జనవరి మొదటివారంలో ప్రారంభించింది. 2024 జనవరిలో అవి రద్దయ్యాయి. ఆలోగా దేశవ్యాప్తంగా 28,030 బాండ్లను వివిధ సంస్థలు, వ్యక్తులు కొనుగోలు చేశారు. వీటి విలువ రూ.16,518 కోట్లు. ఇందులో రూ.12వేల కోట్లకుపైగా ఆయా పార్టీల ఖాతాల్లో చేరాయి.

- గ్రీన్ కో సంస్థ 2022 ఏప్రిల్ 8న మొదటిసారి బీఆర్ఎస్ బాండ్లను కొనుగోలు చేసింది. కానీ అంతకుముందే పలు సంస్థలు బీఆర్ఎస్ బాండ్లను కొనుగోలు చేశాయి. 2022 ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య గ్రీన్ కో, దాని అనుబంధ సంస్థలు కలిసి దాదాపు రూ.40 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయి.
- గ్రీన్ కో సంస్థ.. 2022 ఏప్రిల్ 8 నుంచి 11 మధ్య కాంగ్రెస్‌కు చెందిన రూ.70 లక్షల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది.
- 2022 అక్టోబర్ 8న రూ.2 కోట్ల విలువైన బీజేపీ బాండ్లను సైతం కొనుగోలు చేసింది.
- 2022 ఏప్రిల్ ఏప్రిల్ 22న టీడీపీకి చెందిన రూ.2 కోట్ల విలువైన బాండ్లను గ్రీన్‌కో కొన్నది.
- 2022 ఏప్రిల్ 8 నుంచి 2023 నవంబర్ 15 మధ్య వైసీపీ పార్టీకి చెందిన దాదాపు రూ.8 కోట్ల విలువైన బాండ్లను గ్రీన్ కో, దాని అనుబంధ సంస్థలు కొనుగోలు చేశాయి.
- 2023 ఏప్రిల్ 11న మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణముల్ కాంగ్రెస్ బాండ్లను సైతం గ్రీన్ కో కొనుకోలు చేసింది.

ఫార్ములా -ఈ తెరమీదికి ఇలా..

ఎలక్ట్రిక్ కార్ రేసును హైదరాబాద్‌లో నిర్వహించాలని 2021 డిసెంబర్‌లో ఫార్ములా-ఈ సంస్థకు ప్రతిపాదనలు అందాయి. 10వ సీజన్ రేసును నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఫార్ములా-ఈ మధ్య 2022 జనవరి 17న ఒప్పందం జరిగింది. హైదరాబాద్‌ను ఎంపిక చేస్తూ ఫార్ములా-ఈ చీఫ్ కో ఫౌండర్ ఆల్బర్టో లాంగో, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్, ఈవీ డైరెక్టర్ సుజయ్ కారంపురి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. 2022 అక్టోబర్‌లో ఫార్ములా-ఈ, రాష్ట్ర ప్రభుత్వం, గ్రీన్ కో సంస్థల మధ్య ట్రైపార్టీ అగ్రిమెంట్ జరిగింది. ఫార్ములా-ఈ రేసు 2023 ఫిబ్రవరి 11న మొదలైంది.

క్విడ్ ప్రో కో ఎక్కడిది..

సాధారణంగా క్విడ్ ప్రోకో గానీ, ఇంకా ఏదైనా అవినీతి జరగాలంటే.. ఏదైనా సంస్థకు లాభం చేకూర్చి, అందులో వాటా కింద కొంతమేర లంచంగా తీసుకోవాల్సి ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఫార్ములా-ఈపై చర్చలు జరిగే సమయానికిగానీ, ఒప్పందాలు చేసుకున్నప్పుడుగానీ గ్రీన్ కో అనే సంస్థకు బీఆర్ఎస్‌తో సంబంధం లేదు. ఆ సంస్థ బీఆర్ఎస్ బాండ్లు కొనుగోలు చేసిన ఆరు నెలల తర్వాత ఫార్ములా-ఈ స్పాన్సర్‌షిప్ ఒప్పందం చేసుకున్నది. 10 నెలల తర్వాత రేసు జరిగింది. ఒప్పందం చేసుకున్న తర్వాత బాండ్లు కొనుగోలు చేస్తే అవినీతి జరిగిందన్న వాదనకు అర్థం ఉంటుందని, ముందుగానే కొనుగోలు చేయడం అవినీతి ఎలా అవుతుందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పైగా బీఆర్ఎస్ బాండ్లు కొనుగోలు చేసిన సమయంలోనే బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ, టీడీపీ బాండ్లను సైతం గ్రీన్‌కో కొనుగోలు చేసిందని, మరి అన్ని పార్టీలతోనూ క్విడ్ ప్రో కో జరిగినట్టేనా అని ప్రశ్నిస్తున్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌దే మేజర్ వాటా..

2018 జనవరి నుంచి 2024 జనవరి మధ్య దేశవ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన 28,030 బాండ్లను వివిధ సంస్థలు, వ్యక్తులు కొనుగోలు చేశారు. రూ.12వేల కోట్లకుపైగా పార్టీల ఖాతాల్లో చేరాయి. ఇందులో బీజేపీకి రూ.6,500 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.1300 కోట్ల వరకు బాండ్ల రూపేణా సమకూరినట్టు చెప్తున్నారు. దాదాపు 340 కంపెనీలు కాంగ్రెస్ బాండ్లను కొనుగోలు చేశాయని అంటున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు 340 కంపెనీలతో క్విడ్ ప్రో కో జరిగిందా? అని ప్రశ్నిస్తున్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన ఏసీబీలు కాంగ్రెస్ అధ్యక్షుడిపై విచారణ జరపాలా? అని నిలదీస్తున్నారు.

ఈ రేస్ కేసులో సంయమనం పాటించండి

తొందరపాటు నిర్ణయాలతో తీవ్ర ఫలితాలకు అవకాశం

కాంగ్రెస్‌కు నష్టం వాటిల్లుతుంది

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు అమెరికా ఫ్రెండ్స్ లేఖ

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఫార్ములా ఈ- రేస్ కేసు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రభుత్వం సంయమనం పాటించి చర్యలు తీసుకోవాలని అమెరికాకు చెందిన కాంగ్రెస్ పార్టీ స్నేహితులు హితవుపలికారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీనియర్ మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఫ్రెండ్స్ ఆఫ్ కాంగ్రెస్ యూఎస్ఏ పేరుతో రాసిన ఈ లేఖ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ రేస్ వ్యవహారంలో విచారణ కీలకమైనదని, కానీ, మాజీ ఐటీ మంత్రిని కేవలం సంచలనం సృష్టించడానికే అరెస్టు చేయడం, తొందరపాటు చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదకర ఫలితాలు రావచ్చని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం సమగ్రంగా విచారణ చేసిన తర్వాతే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

చెడు ప్రభావాలు ఇలా..

ఈ కేసులో సంబంధిత విదేశీ కంపెనీపై ఎలాంటి కేసు లేదని, అవినీతి ఆరోపణల కారణంగా, న్యాయస్థానం ఆ కంపెనీని కేసులో పార్టీగా చేర్చాలని ఆదేశిస్తే విదేశీ పెట్టుబడిదారులపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ప్రభుత్వ అధికారులు వ్యక్తిగతంగా, శాఖపరంగా అవమానానికి గురవుతారని, ఇది భవిష్యత్తు ప్రభుత్వాలకు చెడు సందేశం పంపుతుందని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతల అరెస్టు, జైలులో నిర్బంధించడం వంటి చర్యలు రాజకీయ కక్షసాధింపుగా ప్రజలు భావించవచ్చని, ఢిల్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రతిష్ఠపై ఇది ప్రభావం చూపవచ్చని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలపై అవినీతి ఆరోపణలు వస్తే, దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని సూచించారు. ఈ కేసు నిర్వహణలో పొరపాట్లు జరిగితే ఐటీ, పరిశ్రమలశాఖపై చెడు ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏ చర్యలైనా తీసుకొనే ముందు సరైన విచారణ జరిపి, అవినీతి లేదా క్విడ్ ప్రోకో జరిగిందా? లేదా? అని నిర్ధారించుకొన్న తర్వాతనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సీనియర్ మంత్రులు, ముఖ్యంగా ఐటీ, పరిశ్రమల మంత్రులు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆ లేఖలో విజ్ఞప్తిచేశారు.

హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, శంకర్‌నాయక్, ఆనంద్, వెంకటరమణారెడ్డి, దాస్యం, నాయకులు దాసోజు, కర్నె ప్రభాకర్, గెల్లు శ్రీనివాస్

దమ్ముంటే చర్చకు రా రేవంత్!

మొదటిపేజీ తరువాయి...

తేల్చిచెప్పారు. ఈ కేసులు ఆరంభం మాత్రమేనని, నాలుగేండ్లలో ఇంకా ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటామని, దేశానికి రక్షణ కవచంలా న్యాయ వ్యవస్థ ఉన్నదని పేర్కొన్నారు. 'నిజాయితీకి ధైర్యం ఎక్కువ.. రోషంగల్ల తెలంగాణ బిడ్డగా ఏ విచారణనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం' అని చెప్పారు. లాయర్లతో విచారణకు బుధవారం హైకోర్టు అనుమతిస్తే 9న ఏసీబీ విచారణకు లాయర్లతో వెళ్తానని తెలిపారు. 16న ఈడీ విచారణకు కూడా హాజరవుతానని, వారు ఏమడిగినా సమాధానం చెప్తానని, దాపరికం లేదు.. దాయాల్సిందేమీ లేదని వెల్లడించారు.హైకోర్టులో కేవలం క్వాష్ పిటిషన్ కొట్టేసినందుకే కాంగ్రెస్ నాయకులు సంతోషపడుతున్నారని, వాళ్లే శిక్షలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్‌లో అరపైసా అవినీతి కూడా జరగలేదని పునరుద్ఘాటించారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో మంగళవారం రాత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. '50 లక్షలతో దొరికిన దొంగలకు ప్రతి పనిలోనూ అవినీతి, ప్రతి కార్యక్రమంలో ఎంతో కొంత చేతులు మారినట్టు అనిపిస్తుంది' అని నిప్పులు చెరిగారు. 'అధికారాన్ని అడ్డం పెట్టుకొని నువ్వు అక్రమ కేసులు పెడితే.. న్యాయపరంగా, రాజ్యాంగపరంగా ఎదుర్కొనేందుకు నాకున్న ప్రతి హక్కును వినియోగించుకుంటా. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా నేను విచారణకు హాజరయ్యా. కానీ లాయర్లతో రావద్దన్నరు. లగచర్ల కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఇవ్వని స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు మీడియాకు లీకులువదిలి సతాయించిండ్రు. అందుకే లాయర్ల సమక్షంలోనే విచారణ జరగాలని బుధవారం హైకోర్టుకు వెళ్తున్న. ఈ దుర్మార్గుల నుంచి చట్టపరమైన రక్షణ కల్పించాలని కోర్టుకు వెళ్తున్న' అని కేటీఆర్ తెలిపారు.

కక్ష సాధింపు కేసులు

'నా మీద పెట్టింది అక్రమ కేసు, పొలిటికల్ మోటివేటెడ్ కేసు, అందులో ఏమీలేని లొట్టపీసు కేసు. బట్టకాల్చి మీద వేసి ఏదో జరిగిందని చూపెట్టే కక్ష సాధింపు కేసు అని తెలిసీ ఏసీబీ విచారణకు వెళ్లిన. ఏసీబీ కేసుపై హైకోర్టులో పిటిషన్ వేసినం. తప్పుడు ఎఫ్ఐఆర్, ఇష్టమొచ్చినట్టు సెక్షన్లు పెట్టారని వాదించినం. కానీ, హైకోర్టు క్వాష్ పిటిషన్‌ను కొట్టేసింది. దానికే కాంగ్రెస్ నాయకులు చాలా సంతోషపడుతున్నరు. నాకేదో ఉరిశిక్ష వేసినట్టు, నేరారోపణ రుజువైనట్టు సంకలు గుద్దుకుంటున్నరు. నేను నేరం చేసినట్టు హైకోర్టు ఎక్కడా చెప్పలేదు. నాకు శిక్ష వేయలేదు. స్కామ్ జరిగినట్టు కూడా ఎక్కడా అనలేదు.. క్వాష్ పిటిషన్ కొట్టివేతపై సుప్రీంకోర్టుకు పో తం. న్యాయపోరాటం చేస్తం' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

ప్రజా సమస్యలపై మీడియా దృష్టిపెట్టాలి

'ఆడబిడ్డలకు ఇవ్వాల్సిన రూ.2500, వృద్ధులకు ఇవ్వాల్సిన రూ.4000 ఎప్పుడిస్తరో? ఎలా ఇస్తరో? చెప్పాలని కాంగ్రెస్ నాయకులను నిలదీద్దాం. ఫార్ములా కేసు విషయంలో మీడియా చేస్తున్న హడావుడికి బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగం కావద్దు. ఫార్ములా కేసు విషయంలో ఇంట్రెస్ట్ చూపిస్తున్న మీడియా.. ప్రజలు పడుతున్న బాధలను చూపించడంలోనూ చూపించాలి. హైడ్రా, మూసీ బాధితుల కష్టాలను మీడియాలో చూపించండి. ఆరు గ్యారెంటీల అమలు ఫెయిల్ అయ్యి సంవత్సరం తర్వాత అటెన్షన్ డైవర్షన్ కోసం రేవంత్‌రెడ్డి పడుతున్న పాట్లను కూడా అప్పుడప్పుడు చూపించండి. ఆత్మహత్యలు చేసుకుంటున్న ఆటో డ్రైవర్లు, ఉపాధి లేక చనిపోతున్న నేతన్నలు, గురుకులాల్లో అధ్వాన్న పరిస్థితుల మీద కూడా మీడియా దృష్టి పెట్టాలని కోరుతున్నాం' అని కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. ప్రభుత్వం చెప్తున్న అర్ధసత్యాలను ఫ్యాక్ట్ చెక్ చేసుకోవాలని కోరారు.

ఆ పనులు క్విడ్ ప్రో కోతోనే ఇచ్చారా?

మల్లన్నసాగర్ పనులను కూడా మేఘా ఇంజినీరింగ్‌కి ఇవ్వబోతున్నట్టు సమాచారం ఉన్నదని, అది కూడా క్విడ్ ప్రో కోలో భాగంగానే ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టును కూడా మేఘాకే ఇచ్చారని, ఇది కూడా క్విడ్ ప్రో కోలో భాగమేనా అని నిలదీశారు. 'గ్రీన్‌కో కంపెనీ నుంచి ఎలక్టోరల్ బాండ్లు అందుకొని రాజకీయ పార్టీ తెలంగాణలో ఏదైనా ఉన్నదా? కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, వైసీపీకి కూడా గ్రీన్‌కో బాండ్ల రూపంలో విరాళాలిచ్చింది. ఒక్క బీఆర్ఎస్ పార్టీ మీదనే కాంగ్రెస్ నాయకులు ఎందుకు ఏడుస్తున్నరు?' అని కేటీఆర్ నిలదీశారు.

తిరిగి అధికారంలోకి వస్తాం

'అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం నాకు దక్కిన హక్కును నేను తప్పకుండా, విధిగా వాడుకుంట. నాకు భారత న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఉన్నది. నిజం నిలకడ మీద తెలుస్తుంది. బీజేపీ, కాంగ్రెస్ వేర్వేరు కాదు. కాంగ్రెస్‌కు రక్షణ కవచంలా బీజేపీ పనిచేస్తున్నది. గతంలో ఈ రెండు పార్టీలను చిత్తుచేసి అధికారంలోకి వచ్చాం. అక్రమ కేసులపై న్యాయస్థానాల్లోనూ గెలుస్తాం. ప్రజాక్షేత్రంలో ఈ రెండు పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించి తిరిగి అధికారంలోకి వస్తం' అని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌నాయక్, దాస్యం వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, మెతుకు ఆనంద్, కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నగేశ్ రూప్‌సింగ్ పాల్గొన్నారు.

అంతిమ విజయం ధర్మానిదే

'నిజానికి ధైర్యమే కాదు బలమూ ఎక్కువే. ఎదురుదెబ్బలకు బెదిరేది లేదు. ఎదురుదెబ్బలను ఎదుర్కొని విజయబావుటాలమై తిరిగొస్తాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. సత్యానికి పదునూ ఎక్కువేనని, అది కాలంతోపాటు వెలుగుతూనే ఉంటుందని మంగళవారం ఎక్స్‌వేదికగా వ్యాఖ్యలు చేశారు. 'మీరు సృష్టిస్తున్న అబద్ధాలు ఎప్పటికీ నిజం కానేరవు. మీ వెకిలి మాటలు నా మనోస్థైర్యాన్ని తగ్గించలేవు. మీ దృష్టి మరల్చే చర్యలు మా ప్రయాణాన్ని నిలువరించలేవు' అని పేర్కొన్నారు. 'న్యాయవ్యవస్థపై నాకు అపారమైన నమ్మకం, విశ్వాసం ఉన్నది. ధర్మం కోసం, న్యాయం కోసం నేను చేసే పోరాటాన్ని ఆపను. నిజం నిలకడ మీద తెలుస్తుంది' అని స్పష్టం చేశారు.

మంత్రులే న్యాయమూర్తులైెండ్రు

'కొందరు మంత్రులు న్యాయమూర్తులైె వాళ్లే శిక్షలు వేస్తున్నరు. మీడియాలోనో, సెక్రటేరియట్‌లోనో, మంత్రుల పేషీలోనో కాదు.. న్యాయస్థానాల్లోనే ట్రయల్ జరుగుతది. మళ్లీ చెప్తున్న రూపాయి అవినీతి కూడా జరగలేదు. తెలంగాణ కోసం, తెలంగాణ ఇమేజ్‌ను ఆకాశమంత ఎత్తుకు తీసుకపోయేందుకు దేశంలోనే కాదు ప్రపంచపటంలో హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేసేందుకే ఈ- కార్ రేసు నిర్వహణపై నిర్ణయం తీసుకున్నం తప్ప ఏమీ ఆశించి కాదు. కాంగ్రెస్ నాయకులలాగా దివాలాకోరు పనులు చేయాల్సిన కర్మ మాకు లేదు' ' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

వాళ్ల ఇంట్రెస్ట్ ఫార్ములా ఈ.. మా ఇంట్రెస్ట్ ఫార్మర్

'కాంగ్రెస్ నాయకుల ఇంట్రెస్ట్ ఫార్ములా ఈ.. మా ఇంట్రెస్ట్ ఫార్మర్. మేము రైతు భరోసా గురించి మాట్లాడుతం. డైవర్షన్ కోసం రేవంత్ ఏం చేస్తున్నరో మాకు తెలుసు. విధ్వంసం, అటెన్షన్ డైవర్షన్, మోసం చేయడం ఇదే కాంగ్రెస్ నైజం. రైతు భరోసా ఎప్పుడు వస్తదని 75 లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నరు. కేసీఆర్ 12 సార్లు రైతుబంధు ఇస్తే.. రేవంత్ ఒక్కసారి కూడా ఇవ్వలేదు. రైతులకు న్యాయం జరిగేదాకా కొట్లాడాలని మా పార్టీ నాయకులకు చెప్పిన. అటెన్షన్ డైవర్షన్‌తో కాంగ్రెస్ ఆడుతున్న నాటకాన్ని ప్రజల ముందు బట్టబయలు చేయాలని చెప్పిన' అని కేటీఆర్ పేర్కొన్నారు.

> మేఘా సంస్థ కాంగ్రెస్‌కు వందల కోట్ల విరాళం ఇచ్చింది.. క్విడ్ ప్రోకోలో భాగంగానే మేఘా కంపెనీకి, మీ రాఘవ కంపెనీకి కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను రేవంత్‌రెడ్డి ఇచ్చిండంటే ఎలా ఉంటది? మీకు సమ్మతమేనా? పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గారూ! గ్రీన్‌కో కంపెనీ నుంచి ఎలక్టోరల్ బాండ్లు అందుకోని రాజకీయ పార్టీ తెలంగాణలో ఏదైనా ఉన్నదా? క్విడ్ ప్రోకో అంటే కాంగ్రెస్ నాయకులకు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అర్థం తెలుసా? బీఆర్ఎస్‌కు విరాళాలిచ్చిన గ్రీన్‌కోకు ప్రతిఫలంగా ఏం దక్కిందో నిరూపించగలరా?' -కేటీఆర్

> 4వేల కోట్ల రూపాయల మల్లన్నసాగర్ పనులు కూడా మేఘా ఇంజినీరింగ్‌కి రేవంత్‌రెడ్డి ఇవ్వబోతున్నట్టు సమాచారం ఉన్నది. అది కూడా క్విడ్ ప్రో కోలో భాగంగానే ఇస్తున్నరా? మూసీ ప్రాజెక్టు కూడా మేఘాకే ఇచ్చారు. ఇది కూడా క్విడ్ ప్రో కోలో భాగమేనా? సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోయాక మేఘా ఇంజినీరింగ్‌ను బ్లాక్ చేయాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఇచ్చిన రిపోర్టును రేవంత్‌రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదు? మేఘా ఇచ్చిన ఎలక్టోరల్ బాండ్లకు ప్రతిఫలంగానే చర్యలు తీసుకోవడం లేదా?
> -బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఏసీబీ నోటీసు లేఖలా ఉంది!

ఏ సెక్షన్ కింద పిలుస్తున్నారో తెలుపలేదు

నోటీసులో అసంబద్ధ సెక్షన్లు పేర్కొన్నారు

ఏసీబీ నోటీసులపై సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



హైదరాబాద్, జనవరి 7(నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ ఇచ్చిన నోటీసుల్లో ఎలాంటి స్పష్టత లేదని, అవి నోటీసులా కాకుండా లేఖలా ఉన్నాయని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. కేటీఆర్‌కు వచ్చిన నోటీసులకు సంబంధించి మంగళవారం ఓ టీవీ చానల్‌తో మాట్లాడిన ఆయన మూడు అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

1. కేటీఆర్‌కు ఏసీబీ ఇచ్చిన నోటీసును తాను పరిశీలించానని, దానిలో కేటీఆర్‌ను ఏ సెక్షన్ కింద పిలుస్తున్నారో పేర్కొనలేదని తెలిపారు. అది లేఖలా ఉన్నదని అన్నారు. ఏదైనా విచారణ ఏజెన్సీ నోటీసులు ఇచ్చినప్పుడు ఏ సెక్షన్ కింద ఇస్తున్నారో పేర్కొంటారని, కానీ కేటీఆర్‌కు ఇచ్చిన నోటీసులో అవి లేవని చెప్పారు.
2. కేటీఆర్‌కు ఏసీబీ ఇచ్చిన లేఖ సారాంశాన్ని పరిశీలిస్తే.. ప్రశ్నించేందుకు, పత్రాలు సమర్పించేందుకు ఏసీబీ ముందు విచారణకు హాజరుకావాలని ఉన్నదని తెలిపారు. కేటీఆర్ నుంచి ఏదైనా డాక్యుమెంట్ తీసుకోవాలంటే ఆయనకు 94 బీఎన్ఎస్ఎస్ (91 సీఆర్‌పీసీ) కింద నోటీసులివ్వాలని, అవి లేవని చెప్పారు.
3. కేటీఆర్‌కు ఏసీబీ 160 సీఆర్‌పీసీ (ప్రస్తుతం 179 బీఎన్ఎస్) కింద నోటీసు ఇచ్చారని, అయితే ఒక కేసు విషయంలో పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను పిలిపించాలంటే 179 బీఎన్ఎస్ కింద నోటీసులు ఇవ్వాలని పేర్కొన్నారు. కానీ కేటీఆర్ ప్రస్తుతం ఎఫ్ఐఆర్‌లో నిందితుడు మాత్రమే అని, ఎఫ్ఐఆర్‌లో పేరు ఉన్న నిందితుడికి 160 సీఆర్‌పీసీ కింద నోటీసులివ్వొద్దని తెలిపారు.